ప్రజాశక్తి
శనివారం 24 డిసెంబర్ 2022
5
పార్వతీపురం మన్యం



జీడి పంటకు బీమా

కలెక్టరేట్ : జిల్లాలో జీడి పంటకు బీమా సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బీమా సౌకర్యంతో రైతులకు ప్రయోజనం కలుగుతుంది. గత సీజన్‌లో వాతావరణం అనుకూలించక జిల్లాలో జీడీ పంట దెబ్బతిన్న విషయం విదితమే. రైతులు నష్టపోయిన పరిస్థితిని గమనించిన కలెక్టర్ నిశాంత్ కుమార్ జీడితోటలను స్వయంగా పరిశీలించారు. అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పించి ప్రత్యేక బృందాన్ని జిల్లాకు రప్పించారు. ఆ బృందం జరిగిన నష్టంపై ప్రభుత్వానికి ప్రత్యేక నివేదిక సమర్పించింది. జీడి పంటకు వాతావరణం అనుకూలించక పంట దిగుబడి ఎకరాకు రావాల్సిన సరాసరి దిగుబడి 150 నుండి 180 కేజీల కంటే తగ్గినట్లు నమోదైతే ఇ క్రాప్‌ను ఆధారం చేసుకుని బీమా పరిధిలోకి తెస్తారు. గతంలో వాతావరణం అనుకూలించక నష్టం జరగడంతో బీమా కంపెనీ నుంచి పెట్టుబడి రాయితీ వచ్చే అవకాశం ఉందని జిల్లా ఉద్యాన అధికారి కెవిసత్యనారాయణ రెడ్డి జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. జిల్లా కలెక్టర్ చొరవతో జిల్లా రైతులకు శుభవార్త అందిందని ఆయన పేర్కొన్నారు.

వైసిపిది రంగుల రాజకీయం

- ఇసుక దందా, మద్యం దోపిడీ పెచ్చుమీరాయి
- గిరిజన వర్సిటీకి అతీగతీ లేదు
- ఎయిర్‌పోర్టు ఎంత వరకు వచ్చిందో?
- బొబ్బిలి సభలో ప్రభుత్వంపై విరుచుకుపడిన టిడిపి అధినేత చంద్రబాబు



అభివాదం చేస్తున్న చంద్రబాబు



బొబ్బిలిలో బహిరంగ సభకు హాజరైన జనం



అరటిపండ్లు కొనుగోలు చేస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి -బొబ్బిలి, రూరల్, తెర్లాం, బాడంగి

వైసిపి ప్రభుత్వం రంగుల రాజకీయం చేస్తోందని, ఇక ప్రజలు విశ్వశించే పరిస్థితి లేదని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో ఇసుక దందా, మద్యం పేరిట దోపిడీ పెచ్చుమీరాయని విమర్శించారు. రెండో రోజు పర్యటనలో భాగంగా బొబ్బిలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి కుంటుబడిందన్నారు. తాము నిర్మించిన టిడ్కో ఇళ్ల రంగులతో కాలక్షేపం చేస్తున్నాడని, రంగుల ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రకెక్కుతారని విమర్శించారు. జిల్లాలో భోగాపురం ఎయిర్‌పోర్టు ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదన్నారు. పాలకుల చేతకాని తనం వల్ల జిల్లాకు మంజూరైన గిరిజన వర్సిటీకి అతీగతి లేకుండా పోయిందన్నారు. తోటపల్లి ప్రాజెక్టును ప్రారంభించింది, పూర్తిచేసింది టిడిపి హయాంలోనేనని అన్నారు. వంశధార - నాగావళి అనుసంధానానికి ప్రణాళిక రూపొందించామని చెప్పారు. బొబ్బిలి టౌన్‌లోని పాఠశాలల్లో సుద్దముక్కలు, తెల్లకాగితాలకు కూడా డబ్బులు కొరవడ్డాయని, నాడు - నేడు పథకం ఏమైందని ప్రశ్నించారు. చదువుకోవాల్సిన ప్రాంగణాల్లో సచివాలయాల కట్టడాన్ని కోర్టు కూడా కుదరదని చెప్పిందని, ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని అన్నారు. భూమి పట్టాలపైనా, సర్వే రాళ్లపైనా జగన్ బొమ్మలు వేసుకోవడం సిగ్గుచేటన్నారు. స్థానిక సంస్థల అధికారులను, విధులను జగన్ ప్రభుత్వం కాలరాస్తోందని, సర్పంచులకు విధి దీపాలు వేసే అధికారం, చెత్తను తొలగించే ఆర్థిక శక్తి లేకుండా చేశారన్నారు. ఉద్యోగులతోపాటు, వ్యాపారులూ నిర్భయంగా ఉండాలని, అందరికీ టిడిపి అండగా ఉంటుందని అన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే అనుయాయులు వెయ్యి గజాల విలువైన స్థలం కొట్టేశారని, మంత్రి బొత్స మేనల్లుడు జిల్లాలో ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. వైసిపి పాలనపై బొబ్బిలి పులిలై గర్జించాలని పిలుపునిచ్చారు. బాబు ప్రసంగం పార్టీ శ్రేణుల్లో జోష్ తెప్పించినప్పటికీ, చివరిలో సైకోపాలన పోవాలని అనబోయి సైకిల్ పాలన పోవాలంటూ చంద్రబాబు నోరు జారారు. వెంటనే తేరుకుని ప్రజలకు క్షమాపణ చెప్తూ ఆ మాటను వెనక్కి తీసుకుంటున్నట్టు చెప్పారు. సమయం లేదు మిత్రమా అంటూ బాలకృష్ణ డైలాగ్ వేయడంతో యువత, కార్యకర్తలు కేరింతలు కొట్టారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అధ్యక్షతన జరిగిన సభలో మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు మాట్లాడారు.

అడుగడుగునా ఘన స్వాగతం

టిడిపి అధినేత చంద్రబాబుకు అడుగడుగునా నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. రెండోరోజు శుక్రవారం రాజాంలోని తృప్తి రిసార్ట్సు నుంచి ప్రారంభమైన చంద్రబాబు రోడ్డుషో ఒమ్మి, పెరుమాళి, వెలగవలస, తెర్లాం, రేజేరు, కారాడ మీదుగా రాత్రి 6 గంటలకు బొబ్బిలిలోని గొల్లపల్లి చేరుకుంది. కంచరాం వద్ద సుజయకృష్ణ, తెంటు రాజా, ఆర్‌పి భంజ్‌దేవ్, విజయనగరం పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున ఘన స్వాగతం పలికారు. తెర్లాంలో రోడ్డుషో సందర్భంగా సర్పంచ్ బోనాల రూప.. చంద్రబాబుకు బొట్టు పెట్టి, హారతి ఇచ్చారు. గొల్లపల్లి- పిరిడి జంక్షన్ వద్ద టిడిపి బొబ్బిలి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, విశాఖ ఎమ్మెల్యే గణబాబు స్వాగతించారు. గొల్లపల్లి - పిరిడి జంక్షన్ నుంచి బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ గొల్లపల్లి, ఓంకార్ టాకీస్, బజారు, ఎన్‌టిఆర్ బొమ్మ, స్టేట్ బ్యాంక్, రైల్వేస్టేషన్ జంక్షన్, పోలీసు స్టేషన్ మీదుగా వాటర్ ట్యాంకు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ స్థలం వద్దకు చేరుకుంది.

బెల్లం క్రషర్ పరిశీలన

బాడంగి మండలం రేజేరు బెల్లం క్రషర్లు వద్ద ఆగి చెరకు రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చెరకు దిగుబడి, గిట్టుబాటు ధరపై ఆరా తీశారు. చక్కెర పరిశ్రమ మూతతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి పక్కనే అరటిపండ్లు అమ్ముకుంటున్న వ్యక్తితో ముచ్చటించారు. ఆయన వద్ద అరిటిపండ్లు కొని అక్కడే ఉన్న పిల్లలకు, స్థానికులకు పంచిపెట్టారు.

ఉత్తరాంధ్రపై రెడ్ల పెత్తనం ఎందుకు?

విజయనగరం ప్రతినిధి / రాజాం : టిడిపి ఆవిర్భావంతో బిసి సామాజిక వర్గాలు రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందాయని, జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వారిపై రెడ్లపెత్తనం పెరిగిందని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. బిసిలలో అన్ని వృత్తుల వారూ ఆర్థికంగా దెబ్బతిన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం రాజాంలో బిసిలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 శాతానికిపైగా ఉన్న బిసిలను ఆర్థికంగా పైకి తీసుకొచ్చేందుకు టిడిపి పుట్టుకతోనే ప్రణాళికలు రూపొందించి, అమలు చేసిందని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే 20శాతం మద్యం దుకాణాలు కల్లుగీత కార్మికులకు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్రలో ప్రస్తుతం సాయిరెడ్డి, సుబ్బారెడ్డి పెత్తనం చేస్తున్నారని విమర్శించారు. వారికి అడ్డుకట్ట వేయలేని బొత్స బొత్స సత్యనారాయణ టిడిపిపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. సమావేశంలో కళా వెంకటరావు, కొల్లు రవీంద్ర, కె.అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిఎస్ జాయింట్ కమిషనర్ శంకర్ పాండి

ఆదాయ పన్ను చెల్లించాలి

జాయింట్ కమిషనర్ శంకర్ పాండి

ప్రజాశక్తి - పార్వతీపురం

డ్రాయింగ్, డిస్బర్సింగ్ అధికారులు (డిడిఒ) తమ సిబ్బంది జీతభత్యాల నుంచి ప్రతి నెల ఆదాయపు పన్ను చెల్లించాలని విశాఖపట్నం టిడిఎస్ రేంజ్ ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ శంకర్ పాండి అన్నారు. టిడిఎస్ పై డ్రాయింగ్, డిస్బర్సింగ్ అధికారులు (డిడిఒ)కు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సును ఆదాయపు పన్ను శాఖ నిర్వహించింది. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ ఆదాయపు పన్ను చట్టం ప్రకారం ప్రతి నెలా జీతభత్యాల నుంచి పన్ను విధిగా చెల్లించాలన్నారు. ఆదాయపు పన్ను చెల్లించడంలో అలసత్వం వహిస్తే డిడిఒలపై అపరాధ రుసుం పడుతుందని స్పష్టం చేశారు. ఆదాయపు పన్ను చెల్లింపులో అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అశ్రద్ద వహించ వద్దని కోరారు. డిడిఒలు నెల వారీ త్రైమాసిక ఆదాయపు పన్ను రిటర్నులు విధిగా సమర్పించాలన్నారు. సమయానుగునంగా పన్ను చెల్లింపు రిటర్నులు సమర్పించక పోతే డిడిఒలకు సెక్షన్ 234(ఇ) కింద రోజుకు రూ.200 చొప్పున అపరాధ రుసుం, ఖజానా అధికారులకు సెక్షన్ (జి) కింద రూ.500 చొప్పున అపరాధ రుసుం విధిస్తామని తెలిపారు. డిడిఒలు విధిగా టిఎఎన్ సంఖ్య పొందాలని, లేకుంటే రూ.10వేలు జరిమానా విధిస్తామన్నారు. డిఆర్ఒ జె.వెంకటరావు మాట్లాడుతూ టిడిఎస్‌పై ప్రతి డిడిఒకు సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆదాయపు పన్ను అధికారి వి.నాగ సూర్యారావు, ఇన్‌స్పెక్టర్లు పివి రమేష్, పి.ఉమా మహేశ్వరరావు, జిల్లా కలెక్టర్ కార్యాలయ ఎఒ ఆర్.ఉమా మహేశ్వర రావు, సిబ్బంది శ్రీనివాసరావు, డ్రాయింగ్, డిస్బర్సింగ్ అధికారులు పాల్గొన్నారు.

రైస్ మిల్లుల పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని జామి తోట సమీపానున్న మూడు రైస్‌మిల్లుల పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. వస్తున్న ధాన్యంపై ఆరా తీశారు. ప్రస్తుతం టెక్నాలజీతో ఉన్న మిషనరీ పరిశీలించారు. అనంతరం జగత్‌పల్లిలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యం పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పౌష్టికాహారం గురించి ఏ మేరకు అందుతుందో తెలుసుకున్నారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. జగత్‌పల్లి రిసార్ట్స్ పనులను పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ నరసింహమూర్తి, ఎంపిడిఒ గీతాంజలి, ఆర్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మిల్లరుతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్



కె.కొత్తగూడ వద్ద వాటర్‌షెడ్‌ను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

నీటి నిల్వ వసతులు పెంచాలి : పిఒ

ప్రజాశక్తి - కురుపాం/గుమ్మ లక్ష్మీ పురం

నీటి నిల్వ వసతులను పెంచాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కె.కొత్తగూడ వద్ద వాటర్ షెడ్ పనులను ప్రాజెక్టు అధికారి శుక్రవారం పరిశీలించారు. నీటి నిల్వలకు అవసరమైన ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని తద్వారా వర్షాకాలంలో నీరు నిల్వ ఉంటుందని అన్నారు. వాటర్ షెడ్ పనులు, చెరువుల వల్ల భూగర్భ జలం విస్తరిస్తుంది. చుట్టు పక్కల ప్రాంతాలు సారవంతమవుతుందన్నారు. వివిధ రకాల పంటలు పండిం చి ఆదాయం సమకూర్చుకొనేందుకు గిరిజనులకు అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. మెట్ట, అటవీ ప్రాంతంలో నీటి వసతులు పెరగడం వల్ల వనాల విస్తరణకు అవకాశాలు పెరుగుతా యని చెప్పారు. ఇంజినీరింగ్ అధికారులు దృష్టి సారించాలని, పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

ఏకలవ్య పాఠశాల తనిఖీ

గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య పాఠశాలను ప్రాజెక్టు అధికారి తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులను ఆయన పరిశీలించారు. ఆహార పదార్థాలు తయారీ, పాత్రలు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంలో రాజీ ఉండరాదని ఆయన స్పష్టం చేశారు. ప్రామాణిక విద్యా బోధన ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారి జె.శాంతీశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిహెచ్‌డబ్ల్యుఒలను ఆశాలుగా గుర్తించాలని నిరసన

సీతంపేట : కమ్యూనిటీ హెల్త్‌వర్కర్లను ఆశాలుగా గుర్తించాలని సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఐటిడిఎ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. యూనిఫాం అందరికీ ఇవ్వాలని, ప్రతినెలా ఐదో తేదీలోగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాలు పెంచాలన్నారు. అనంతరం ఐటిడిఎ పిఒ బి.నవ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా గుర్తించడంపై ప్రభుత్వానికి లేఖ రాస్తానన్నారు. అలాగే అక్టోబర్ వరకు జీతాలు చెల్లించామని, నవంబర్ నెల జీతం ట్రెజరీలో పెండింగ్ ఉందని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఇంకా సమర్ధవంతంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు వి.ఇందిర, మండల అధ్యక్ష కార్యదర్శులు సురేష్, కాంతారావు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు కమల, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ వినియోగదారుల దినోత్సవం

ప్రజాశక్తి - కలెక్టరేట్

జాతీయ వినియోగదారుల దినోత్సవం శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా సరఫరాల అధికారి కెవిఎల్ఎన్ మూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం భాస్కర జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటల నుండి నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అతిధులు, వినియోగదారుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొంటారని ఆయన అన్నారు.

వెంటాడుతున్న గ్రూపుల భయం

- ప్రభుత్వ వ్యతిరేకతను సొమ్ము చేసుకోలేని వైనం
- నాయకత్వం మారినా కేడర్‌లో పెరగని ఆత్మవిశ్వాసం

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గ టిడిపిని గ్రూపు రాజకీయాల భయం ఇంకా వెంటాడుతోంది. 2014ఎన్నికల్లో ఆఖరి నిమిషంలో కాంగ్రెస్‌ను వీడి టిడిపిలో చేరిన గుమ్మిడి సంధ్యారాణి సీటు సొంతం చేసుకున్నారు. అంతవరకూ పార్టీలో ఏకఛత్రాధిపత్యం వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్‌కి పార్టీ తీసుకున్న నిర్ణయం మింగుడు పడలేదు. కులధృవీకరణ పత్రం లేకపోవడంతో పార్టీ నాయకత్వం భంజ్‌దేవ్‌ను పక్కన పెట్టింది. తన చెప్పుచేతల్లో వుండే అభ్యర్థిని దించేందుకు ఆయన ప్రయత్నించినా అధిష్టానం మద్దతు నీయలేదు. దీంతో ఆయన సంధ్యారాణి అభ్యర్థి త్వాన్ని అంగీకరించక తప్పని పరిస్థితి ఏర్పడింది. అప్పటి నుంచి పార్టీని గ్రూపు రాజకీయాల బెడద నీడలా వెంటాడుతూనే ఉంది. ఫలితంగా పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. 2019ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా భంజ్‌దేవ్ పోటీ చేసి ఓడిపోయారు. సంధ్యారాణి అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు భంజ్ దేవ్ గ్రూపునకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఓడించేందుకు ప్రయత్నించారనే ప్రచారం అప్పట్లో జరిగింది. భంజ్ దేవ్ అభ్యర్థిగా బరిలో ఉన్నప్పుడు సంధ్యారాణి అనుచరులు మద్దతు ఇవ్వలేదనే వాదనలు వినిపిం చాయి. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న సంధ్యారాణే మళ్లీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఉంది. ఆమె నాయకత్వంలోనే నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు జరుగుతు న్నాయి. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్న భంజ్‌దేవ్ సహకారంతో ఆమె కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారు. టిడిపి రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు అప్పుడప్పుడు చేపడుతున్న ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో ఇద్దరు నాయకులు ఐక్యంగా ఉన్నామనే భావం కేడర్ కలిగించే ప్రయత్నం చేస్తున్నా అది వారిలో ఆత్మవిశ్వాసం నింపడం లేదు. పార్టీ గెలుపు కోసం పని చేస్తున్నట్లు పైకి కనిపిస్తున్నా లోలోన గ్రూపు రాజకీయాలు నివురుకప్పిన నిప్పులా రాజుకుంటున్నాయనే ప్రచారం జరుగుతోంది.

కేడర్ లో నిరాశ, నిస్పృహలు:

2014ఎన్నికల్లో పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా నియోజకవర్గంలో ఓటమి పాలైంది. అయినా నియోజకవర్గ ఇన్చార్జిగా భంజ్ దేవ్ షాడో ఎమ్మెల్యేగా వ్యవహరించారు. సంధ్యారాణి ఎమ్మెల్సీ గా ఉన్నా ఆమె మాట చెల్లుబాటు కాకుండా భంజ్ దేవ్ ప్రయత్నాలు సాగించారు. 2019ఎన్నికల్లో భంజ్ దేవ్ ఓటమి పాలయ్యారు. దీంతో టిడిపి శ్రేణుల్లో నిరాశ నిస్పృహలు ఆవహించాయి.తర్వాత నియోజకవర్గ ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టిన సంధ్యారాణిపై పార్టీ నాయకత్వం గంపెడాశలు పెట్టుకుంది. భంజ్ దేవ్‌తో కలిసి పని చేయాలని అధిష్టానం సూచించినా ఆమె వ్యవహారశైలి లో మార్పు రాలేదు. భంజ్‌దేవ్ గ్రూపునకు చెందిన నాయకులు, కార్యకర్తల పట్ల వివక్ష చూపిస్తున్నారనే ఆరోపణలు గూడు కట్టుకుంది .ఆయన గ్రూపునకు చెందినముఖ్య నాయకులను కార్యక్రమాలకు దూరం పెట్టడం చర్చనీయాంశమవుతోంది. భంజ్ దేవ్ అనుచరులనే అభిప్రాయంతో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గొర్లి విజయకుమారి, ఆమె భర్తను సంధ్యారాణి వారిని పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. రానున్న ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేయాలనుకుంటున్న సంధ్యారాణి భంజ్ దేవ్ గ్రూపు నాయకులను కలుపుకుని వెళ్లడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మక్కువ మండలానికి చెందిన సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావు టిడిపిని వీడి బిజెపిలో చేరారు. అంగబలం, అర్ధబలం వున్న పెంట తిరుపతి రావు ఇప్పుడు టిడిపిలో చేరడానికి ఆసక్తి చూపిస్తున్నారు .ఆయన్ను పార్టీలో చేర్చుకోవాలని భంజ్‌దేవ్ సహా కొంతమంది నాయకులు చెపుతున్నా సంధ్యారాణి పట్టించుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా రాష్ట్ర స్థాయి లో పార్టీ నాయకత్వం సూచించిన అంశాలకే పరిమితమవుతూ విమర్శలు చేయడానికే ఆమె ప్రాధాన్యత ఇస్తున్నారు. సాలూరు మండలం కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల లో బాలికల పట్ల హెచ్ఎం లైంగిక వేధింపులకు పాల్పడిన విషయంలో ప్రతిపక్ష పార్టీ నాయకురాలిగా, గిరిజన నాయకురాలిగా ఆమె కనీస స్పందించక పోవడం చర్చనీయాంశమైంది. కొటియా గ్రామాల వివాదం విషయంలోనూ టిడిపి ఇంచార్జి సంధ్యారాణి తగిన రీతిలో స్పందించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా కొత్త వ్యక్తి ని ఎంపిక చేయాలని కొంతమంది నాయకులు అధిష్టానంపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. వరుసగా రెండు ఎన్నికల్లో ఓటమి పాలైన టిడిపికి జవసత్వాలు నింపేందుకు రాష్ట్ర నాయకత్వం ఏమేరకు ప్రణాళిక సిద్ధం చేస్తుందో వేచి చూడాల్సిందే.

మన్యంపై చలి పంజా

- క్రమేపీ తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- కమ్ముకుంటున్న పొగమంచు
- అవస్థలు పడుతున్న వృద్ధులు, పిల్లలు



మంట కాగుతున్న స్థానికులు

ప్రజాశక్తి-కురుపాం

మన్యంలో కొద్ది రోజులుగా చలి పులి పంజా విసురుతోంది. ప్రస్తుతం మన్యంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. గురువారం ఉదయం 6 గంటలకు ఉష్ణోగ్రతల 13 డిగ్రీలు, శుక్రవారం ఉదయం 11 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అన్ని గిరిజన ప్రాంతాలనూ మంచు దుప్పటి కప్పేసింది. పెరిగే పొగమంచు ధాటికి రాకపోకలకు ప్రయాణికులు, వ్యవసాయ, వాహనదారులు భయపడుతున్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి. ఉదయం 10 గంటల వరకూ ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఆరు బయట చలి మంటలు వేసుకుంటున్నారు. డిసెంబర్‌లోనే ఇలా ఉంటే జనవరిలో కనిష్ట స్థాయికి పడిపోయే ప్రమాదముందని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

భామిని : ఏజెన్సీలో గత రెండురోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గి, చలి తీవ్రత పెరిగింది. రాత్రులు మంచు కురవడంతో విపరీతంగా పెరిగింది. గతం రెండు రోజులుగా రాత్రి పూట ఉష్ణోగ్రత 14గా నమోదవుతుంది. చలి, మంచు కురిసే ఈ వాతావరణంలో పొలాలకు, ధాన్యం కళ్లాల్లో కాపు కాసే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలి పంజాను తట్టుకోడానికి ప్రజలు మంటలు కాగుతూ ఉపశమనం పొందుతున్నారు .

కమ్మేస్తున్న పొగమంచు

మన్యంలో చలికి తోడు పొగమంచు కూడా భారీగా కురుస్తోంది. ఉదయం 10 గంటల వరకు మంచు తెర తీయడం లేదు. మంచు వర్షంలా కురుస్తోంది. దీంతో గిరిజనులు పనులకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మన్యంలో రాకపోకలకు ఇప్పటికే తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యార్థులు పాఠశాలలకు, గిరిజనులు కూలి పనులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్ని దుస్తులకు గిరాకీ

చలి తీవ్రత అధికంగా ఉండడంతో ఏజెన్సీలో ఉన్ని దుస్తులకు గిరాకీ పెరిగింది. పాఠశాలకు వెళ్లే పిల్లలకు వారి తల్లిదండ్రులు స్వెట్టర్లు, టోపీలు కొనుగోలు చేస్తున్నారు.

మరింత అప్రమత్తంగా ఉండాలి



శీతాకాలంలో చిన్నారులు, వృద్దులు మరింత అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా నిమోనియా వచ్చే ప్రమాదముంది. నిత్యం వేడి పదార్థాలను మాత్రమే తీసుకోవాలి. కోవిడ్ నుంచి కోలుకున్న వారు మాస్కు ధరిస్తే మేలు. వీరికి ఆయాసం వచ్చే అవకాశం ఉంది. ఊపిరితిత్తుల సమస్యలు ఎదురవుతాయి. జాగ్రత్తలు పాటించాలి. ఇన్ఫెక్షన్ కారణంగా నిమోనియా వస్తుంది. దీని వల్ల జ్వరం, దగ్గు, జలుబు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. చిన్నారులు, వృద్ధులు బయటకు వెళ్లకూడదు. చల్లని పదార్థాలను తీసుకోకూడదు.

.కె. సందీప్ కుమార్ చిన్నపిల్లల వైద్య నిపుణులు

పాటించాల్సిన జాగ్రత్తలు

- చలికాలంలో శీతల పదార్థాలకు దూరంగా ఉండాలి. వేడిగా ఉండే వాటిని తినాలి
- మంచులో తిరగడం తగ్గించాలి. అత్యవసరమైతే మాస్కులు ధరిస్తే మేలు
- శీతాకాలంలో చాలామంది తక్కువ నీరు తాగుతారు. అలాకాకుండా ఎక్కువ తాగితే లోపల పేరుకుపోయిన కఫం బయటికి వస్తుంది.
- నిమోనియా రాకుండా చిన్నారులు, పెద్దలు టీకాలు వేయించుకోవాలి.
- పొగ తాగేవారికి బ్రాంకైటిస్ వచ్చే ప్రమాదముంది. చలికాలంలో పొగతాగడం మానుకోవాలి.
- శరీరానికి వెచ్చదనం ఇచ్చే దుస్తులు వేసుకోవాలి.



డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి - పాలకొండ

వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు ఆవాల సంఘం నాయుడు మాట్లాడుతూ పిఆర్‌సి బకాయిలను వెంటనే చెల్లించాలని, విడతల వారీగా అద్దె బస్సులను తగ్గించి ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్నారని, వాటికి సబ్సిడీపై వచ్చిన డబ్బులను విద్యుత్ బస్సులను నడిపే ఓనర్లకు ఇవ్వడానికి నిశ్చయించారని అలా కాకుండా ఆ డబ్బులు ఆర్‌టిసికే అప్పగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వాటి నిర్వహణ ఆర్టీసీ సంస్థ నిర్వహిం చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా కార్మికులకు రావాల్సిన ప్రయోజనాలన్నీ కల్పించాలని, అన్లిమిటెడ్ మెడికల్ సదుపాయాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలలుగా రావాల్సిన ఓటీలు, నైట్ డ్యూటీల బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. ఈయనతో పాటు గోవిందరావు, కాద రాము తదితరులున్నారు.

తక్షణమే ధాన్యం కొనాలని ధర్నా

ప్రజాశక్తి - కురుపాంరూరల్


ప్రభుత్వం తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన వారం రోజుల్లో డబ్బులు చెల్లించాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గరుగుబిల్లి మండలం సంతోషపురం రైతు భరోసా కేంద్రం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కరణం రవీంద్ర, నాయకులు బివి రమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించినప్పటికీ ఎక్కడా కొనుగోళ్లు సజావుగా సాగడం లేదన్నారు. రైస్ మిల్లర్లు క్వింటాకు ఐదు కిలోల చొప్పున అదనంగా తీసుకుంటున్నారని వివరించారు. మండలంలోని రైతులు పాలకొండలోని మిల్లులకు ధాన్యం తరలించడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన రవాణా ఛార్జీలు చాలక రైతులు వేలాది రూపాయలు భారాన్ని మోయాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జంబ్లింగ్ పద్ధతిలో ధాన్యాన్ని తరలించే ప్రక్రియ బదులు రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లుకు ధాన్యం తరలించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. తేమ పేరుతో మిల్లర్లు అదనంగా ధాన్యం తీసుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను నివారించాలని డిమాండ్ చేశారు. లేనిచో రైతులను ఐక్యం చేసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు సూర్యనారాయణ, గోపాల్, ముసలినాయుడు, రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలని స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో పోస్టర్ విడుదల చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గేదెల సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వంజరాపు సత్యంనాయుడు మాట్లాడుతూ రైతులు కష్టపడి అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి రైతులు పండించిన పంటలను అమ్ముకోవడానికి రైతులు నానా అగచాట్లు పడుతున్నారన్నారు. ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు అధికారులు,



సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నప్పటికీ ఆచరణలో అమలు చేయడంలేదన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులు రైతులను కంగారు పెడుతున్నాయని, దీనికి తోడు పండగ సమీపిస్తుండడంతో రైస్ మిల్లర్లు ఎత్తు గన్నీ బ్యాగులు ఇవ్వకుండా, కారణాలు చెప్పి కాలయాపన చేస్తున్నారన్నారు. విసిగి పోయిన రైతులు దళారులు, మిల్లర్లను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు కూలి సంఘం నాయకులు మామిడి సింహాద్రి నాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, రామారావు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లను అప్పగిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

సమగ్ర విద్యాభివృద్ధికి కృషి : డిప్యూటీ సిఎం

మక్కువ: రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నారని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ కంటెంట్ తో కూడిన ట్యాబ్‌ను శుక్రవారం ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల కంటే దీటుగా ఉండాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం నాడు-నేడు నిధులతో పాఠశాలలను అభివృద్ధి చేస్తుందన్నారు. విద్యార్థులకు అమ్మఒడి వంటి పథకాలను అందిస్తూ తల్లిదండ్రులకు ఆర్థికంగా చేయూత అందిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు అర్థమయ్యేలా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు, వైసిపి మండల నాయకులు రంగునాయుడు, అన్ని జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రబీ ఇ-క్రాప్‌పై దృష్టి సారించండి

సాలూరు : రబీ సీజన్‌లో పంట సాగుకు సంబంధించి ఇ-క్రాప్ నమోదుపై వ్యవసాయ సహాయకులు ఉద్యానవన సహాయకులు దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ ఎడి మధుసూదనరావు కోరారు. శుక్రవారం ఎడి కార్యాలయంలో నిర్వహించిన వ్యవసాయ, ఉద్యాన సహాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రైతుకు రబీకి సంబంధించిన ఈ క్రాప్ నమోదు చేయాలని కోరారు. రైతు భరోసాకు సంబంధించి కూడా అర్హులైన రైతులకు ఇకెవైసి పూర్తి చేయాలని కోరారు. ఎఒ అనూరాధ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఇఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆశ్రమానికి అనాథ వృద్ధురాలు

సాలూరు : స్థానిక వ్యవసాయ ఐటిడిఎ ఎదురుగా ఉన్న జాతీయ రహదారి పక్కన వదిలేసిన అనాథ వృద్ధురాలిని స్థానిక సామాజిక కార్యకర్తలు విజయనగరంలోని వృద్ధాశ్రమానికి చేర్చారు. కొద్దిరోజుల క్రితం ఆ వృద్ధురాలికి పక్షవాతం వచ్చిందని రోడ్డు పక్కన వదిలేసి వెళ్లిపోయారు. దీన్ని గుర్తించిన సామాజిక కార్యకర్త కోడూరి సాయి శ్రీనివాసరావు ఆమెకు భోజనం తీసుకెళ్లి సపర్యలు చేశారు. ఒడిశాకు చెందిన ఆమెను ఒంటరిగా రోడ్డుపై వదిలేయడంతో ఆమెకు ఆపన్నహస్తం అందించారు. ఈ విషయం పత్రికల్లో రావడంతో విజయనగరం పట్టణానికి వృద్ధాశ్రమ నిర్వాహకులు ఆమెను ఆశ్రమం చేర్చుకున్నారు. కోడూరి సాయి శ్రీనివాసరావు సహ ఇతర సామాజిక కార్యకర్తలు ఆ వృద్ధురాలిని విజయనగరం తీసుకెళ్లి ఆశ్రమానికి అప్పగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డు డిడి నాగార్జున

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బలోపేతం

గుమ్మలక్ష్మీపురం: జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా గురుగుబిల్లి మండలం తోటపల్లి ప్రకృతి ఆదివేదోభవ ప్రాంగణంలో శుక్రవారం మాథాసి విత్తన ఉత్పత్తిదార్ల కంపెనీ, అన్నపూర్ణేశ్వర గిరి శక్తి ఉత్పత్తిదారుల కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశాన్ని నాబార్డ్ డిడి ఎంటి నాగార్జున అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాథాసి విత్తన ఉత్పత్తిదారుల సంఘం ప్రగతిని రైతులు కంపెనీ చైర్మన్ మర్రాపు త్రినాథరావు, డైరెక్టర్ మన్మధరావు వివరించారు. నాబార్డ్‌తో పాటు వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ, డిజిటల్ గ్రీన్ సంస్థ, స్వంద ఆర్గానిక్ 42 కంపెనీల సహకారంతో జట్టు సూచనల మేరకు మార్కెటింగ్ చేస్తున్నామని, రైతులకు విత్తనాలను తమ ఇంటి వద్దకే చేరుస్తున్నామని తెలిపారు. డిడిఎం నాగార్జున మాట్లాడుతూ నాబార్డ్ ద్వారా సంఘాలు సంస్థలకు ఉపయోగపడే అనేక పథకాలు ఉన్నాయని తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


గుమ్మలక్ష్మీపురం : మండలంలోని తాడికొండ పిహెచ్‌సి పరిధిలోని 104 సిబ్బంది ఆధ్వర్యంలో కొండవాడ పంచాయతీ లక్కగూడలో మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సీనియర్ వైద్యాధికారి డాక్టర్ ప్రభాకరరావు, తాడికొండ పిహెచ్‌సి వైద్యులు పి.అభిలాష్, విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు భీమశంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ శిబిరంలో లక్కగూడతో పాటు మొరమ, చదునుగూడ, పులిగుడ కొండవాడ తదితర గ్రామాల ప్రజలు హాజరై వైద్య సేవల్ని పొందారు. ఉచితంగా మందులు సరఫరా చేశారు. రోగుల్లో నిరుపేదలను గుర్తించి డాక్టర్ ప్రభాకర్ స్నేహితులు, కుటుంబ సభ్యులు ఉచిత బట్టలు అందజేశారు. అలాగే అన్నదానాన్ని కూడా నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది, రిటైర్డ్ ఉద్యోగ ఉపాధ్యాయుల సంఘం నుంచి సభ్యులు హాజరై తగిన సహాయ సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణాలపై దృష్టి : డిఎల్‌డిఒ

వీరఘట్టం : మండలంలో జగనన్న గృహ నిర్మాణాలపై దృష్టి పెట్టాలని పాలకొండ డిఎల్‌డిఒ వివి గోపాలకృష్ణ సచివాలయాల డిజిఒలను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిజిఒలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పర్యటించి జగనన్న గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ భవనాలు, ఆర్‌బికెలు, వెల్‌నెస్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీల పనులు వేగవంతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎ.ప్రభాకరరావు, ఇఒ వి.రామచంద్రరావు, సచివాలయ డిజిఒలు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి

పాచిపెంట : విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలని ఆ సేవా సంఘం నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు కంగ్గర చిన్న అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సేవా సంఘం మండల నాయకులు మారోజు సంతు, మునక సత్యనారాయణ, చెరుకూరి ఈశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, నిరుపేద కుటుంబాలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ బిసి కార్పొరేషన్ ద్వారా కేటాయించిన డబ్బులను వెనకబడి ఉన్న విశ్వబ్రాహ్మణులకు మంజూరు చేసి సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలని, 50ఏళ్లు నిండిన విశ్వబ్రాహ్మణులకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులతో పాటు సిఐటియు మండల నాయకులు చింత పోలిరాజు పాల్గొన్నారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న పడాల భూదేవి

చంద్రబాబును కలిసిన భూదేవి

సీతంపేట : టిడిపి అధినేత చంద్రబాబునాయుడును రాజాంలో శుక్రవారం పాలకొండ నియోజకవర్గ నాయకులు పడాల భూదేవి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువతో సన్మానించారు. అలాగే పాలకొండ నియోజకవర్గంలో తాను చేస్తున్న కార్యక్రమాలకు సంబంధించిన నివేదిక అందజేశారు.

పింఛన్లను పునరుద్ధరించాలి

పార్వతీపురంటౌన్ : మున్సిపాల్టీ పరిధిలో సుమారు 350మందికి సామాజిక భద్రత పింఛన్లు నిలిపివేసినట్లు సచివాలయ కార్యదర్శులు నోటీసులు అందజేయడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పట్టణ సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు అన్నారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పింఛనుదారులు, మంటినీసాలను చూపిస్తూ పింఛన్లు ఆపడం అన్యాయమన్నారు. ఏ ఆధారమూలేని పేదలకు, ప్రభుత్వ నిబంధనల్లో భాగంగా గుర్తించిన పేదలకు అర్హులైన సామాజిక భద్రత పింఛను లబ్ధిదారులుగా గతంలో ఎంపిక చేసి ప్రతినెలా వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్లు ప్రభుత్వం ఇస్తుందన్నారు. వివిధ కారణాలు చూపి పింఛను రద్దు చేయడం దారుణమన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి నిలిపివేసిన పింఛన్లను పునరుద్ధరించాలని కోరారు.

కైకాల మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రముఖ నటులు, మాజీ పార్లమెంటు సభ్యులు కైకాల సత్యనారాయణ మృతి పట్ల సిపిఎం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలుయజేస్తూ సత్యనారాయణ పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాల్లో పలు విభిన్నమైన పాత్రలు పోషించారని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంటు సభ్యులుగా సేవలందించారని, ఆయన నటనతో ప్రజలను పరవశింపజేశారని, ఆయన మరణం సినీ, కళా రంగానికి తీరని లోటని పేర్కొన్నారు.

ఆధార్ అనుసంధానం వేగవంతం

కొమరాడ : ఓటర్ కార్డుకు ఆధార్ లింక్ వేగవంతం చేయాలని తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బూత్ లెవెల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా ఆధార్ కార్డు లింకులు చేయాలన్నారు. బిఎల్వోలు తక్షణమే లింక్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అలాగే ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించిన పరిశీలన పూర్తి చేయాలన్నారు. మండలంలో 556 ఎమ్మెల్సీ ఓటర్లు నమోదయ్యారన్నారు. సమావేశంలో ఆర్ఐ శ్రీనివాసరావు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

కష్టపడి పనిచేయాలి : బొత్స

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రానున్న ఎన్నికల్లో వైసిపిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్, రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో వైసిపి జిల్లా విస్తృత స్థాయి సమావేశం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కులం, మతం, ప్రాంతం, ప్రతిపక్షం అన్న తేడా లేకుండా అవినీతికి ఆస్కారం లేకుండా రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి నేరుగా సంక్షేమ పథకాల అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రతిపక్ష నాయకులు చెబుతున్న మాటలను ప్రజలు వినే పరిస్థితిలో లేరన్నారు. రానున్న ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో వైసిపి విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, ఎమ్మెల్యేలు పాముల పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, వి.కళావతి, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు, పెద్దలు, నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గిరిశిఖర గ్రామాలు ప్రకృతి ఉత్పత్తులకు నిలయాలు

పాచిపెంట : గిరి శిఖర గ్రామాల్లో పండిస్తున్న పంటలకు మంచి గిరాకీ ఉందని, ఎలాంటి ఎరువులు, పురుగుమం దులు వాడని చిరుధాన్యాలకు అత్యంత ప్రాధాన్యత ఉందని, చిరు ధాన్యాల సాగును మరింత విస్తారంగా సాగు చేయాలని సహాయ వ్యవసాయ సంచాల కులు మధుసూదనరావు అన్నారు. మండలంలోని శతాభిలో శుక్రవారం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సహజ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు గిరి శిఖర గ్రామాలు ప్రత్యేకమైనవని, ఈ ఉత్పత్తు లకు మరింత మార్కెటింగ్ సదుపాయా లను కలుగజేసి ఈ ఫామ్ ఆన్లైన్ మార్కెటింగ్ ద్వారా మంచి ధర వచ్చేలా చేయవచ్చన్నారు. కావున కేంద్రం 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరం గా ప్రకటించిన సందర్భంగా చిరు ధాన్యాల విత్తనాలను రానున్న ఖరీఫ్‌కు పంపిణీ చేస్తామన్నారు. గిరిజన రైతులు చిరు ధాన్యాల సాగును పెంచాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు మాట్లాడుతూ చలి వాతావరణంలో పండే ద్రాక్ష, సిల్వర్ వోక్ వంటి వాటితో పాటు ఇతర పంటలను కూడా ప్రయోగాత్మకంగా పరిశీలించాలని అన్నారు. అలాగే శతాభిలో ప్రకృతి సేద్యానికి సంబంధించిన ప్రాజెక్టు రిపోర్టును తయారు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రకతి వ్యవసాయ ఉత్పత్తు లకు మార్కెటింగ్ సదుపాయా లను కలుగజేసి శతాభి బ్రాండ్ అభివృద్ధిపర్చేలా చర్యలు చేపడతామని తెలిపారు. సర్పంచ్ రామయ్య మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుకు సుముఖంగా ఉన్నామని, అయితే ప్రాసెసింగ్ సదుపాయాలు కల్పించాలని కోరారు. చిరుధాన్యాలతో పాటు తేనె, వెదుర్లు, కాగు, చింతపండు, నరమామిడి చెక్క, కాఫీ వంటి అనేక ఉత్పత్తులు ఫిబ్రవరి నుంచి జూలై వరకు అందుబాటు లో ఉంటాయని మంచి ధర వచ్చేలా చూడాలని కోరారు. ఎంపిటిసి సభ్యులు రాజు మాట్లాడుతూ పసుపు పంటను అభివృద్ధి పర్చామని, ముందుగా ఒకటి, రెండు సెంట్లు సాగు చేసిన పసుపు ఈ ఏడాది 20 ఎకరాలకు సరిపడా విత్తనాన్ని తయారు చేశామని, రాబోయే రోజుల్లో అల్లం సాగుకు ప్రయత్నిస్తు న్నామన్నారు. ఒక్కొక్క గ్రామాన్ని తీసుకుని ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి పరచాల ని కోరారు. కార్యక్రమంలో ఎఒ కె.తిరుపతి రావు, ప్రకృతి సేద్య ప్రతినిధులు యశోద, తిరుపతి నాయుడుతో పాటు మార్కెటింగ్ ప్రతినిధులు నరసింహ, మానస, విఎఎ కిరణ్ పాల్గొన్నారు.

బుడ్డిపేటలో కంటి పరీక్షలు

సీతానగరం: మండలంలోని పెదబోగిలి పంచాయతీ పరిధిలో గల బుడ్డిపేటలో పుష్పగిరి ఆసుపత్రి వారి చేత ఎల్వీఆర్ సంస్థ ఉప సర్పంచ్ కె.అరవింద్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి, వైద్యులు రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆపరేషన్ పడిన వారికి ఉచితంగానే ఆపరేషన్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎస్.సింహాచలం, అప్పలనాయుడు, వెంకటరమణతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆరాధ్యం కప్పరమ్మ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజనుల ఆరాధ్య దైవం కప్పరమ్మ దేవతను గిరిజనుల భక్తిశ్రద్ధలతో శుక్రవారం పూజించారు. పంటలు బాగా పండాలని, పిల్లాపాపలతో సుఖశాంతులతో ఉండాలని ప్రతి ఏడాది కందికొత్తలు ప్రారంభ సమయంలో కప్పరమ్మ దేవతను గిరిజనులలో పూజించడం తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. ఇందులో భాగంగానే ఇరిడి సమీపంలో ఉన్న కప్పరమ్మ కొండకు వెళ్లి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు భక్తి శ్రద్ధలతో పూజించారు. ఇక్కడి నుంచి ప్రతి గ్రామంలో కందికొత్తల ఉత్సవాలు గిరిజనులు జరుపుకుంటారు. ఉత్సవాల్లో భాగంగా గొడ్డలమ్మను పూజించిన అనంతరం గ్రామాల్లో ఊరేగించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ పండగ నేపథ్యంలో గ్రామాల్లో వారం రోజుల పాటు పండగ వాతావరణం కనిపిస్తుంది.

భామిని : సంస్కృతి, సంప్రదాయాలకు భిన్నంగా జీవించే ఆదివాసీ గిరిజనులు వారి పండుగలు ప్రత్యేకం. ప్రకృతిని నమ్మి పోడు సాగే జీవనాధారం ఏడాదిలో పండే తొలి పంటను ఇష్ట దైవం గ్రామ దేవత గొడ్డలమ్మకు సమర్పించే పండుగే కందికొత్త పండుగ. మనిగ, పరిడి, యతంగూడ గ్రామాల్లో జాతపు తెగ కుటుంబీకులు ఈ పండుగలు ప్రారంబించారు. మొదటి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించి రెండో సంబంధిత గ్రామాల్లో గ్రామ జన్నొడు (పూజారి) గొడ్డలమ్మ ప్రతిమను కీర్తిరాయి కుటుంబీకులు భామినిలో తొలి పూజ చేసి డప్పు, వాయిద్యాల నడుమ ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు బిడ్డిక కృష్ణారావు, నిమ్మల మోహనరావు, కోలక సంజీవరావు , కొండగొర్రి చంటి తదితరులు పాల్గొన్నారు.



కప్పరమ్మ దేవతకు పూజలు చేస్తున్న గిరిజనులు

దళిత ఉద్యోగులను వేధించడం సరికాదు

పాలకొండ : దళిత ఉద్యోగులను వేధించడం సమంజసం కాదని ఆలిండియా దళిత రైట్స్ ఫారం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిని మోహనరావు, డివిజన్ అధ్యక్షులు గురుగుబిల్లి రవికుమార్ ప్రశ్నించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ డ్యూటీల విషయంలో న్యాయం చేయమని అధికారి వద్దకు వెళ్తే ఆర్టీసీ డిపో మేనేజరు తప్పుడు నివేదిక ఇచ్చి దళిత ఉద్యోగిని సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. గత నెలలో జరిగిన సంఘటనను ఆధారంగా చేసుకొని పై అధికారులు ఒక దళిత ఉద్యోగిని సస్పెండ్ చేశారని, తప్పుడు నివేదిక ఇచ్చి విచారణ పేరిట ఆ ఉద్యోగిని సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు తప్పుడు నివేదికతో పార్వతీపురం అధికారికి సమాచారం ఇవ్వగా తప్పుడు నివేదిక ఆధారంగా దళిత ఉద్యోగిని సస్పెండ్ చేయడం ఎంత మాత్రమూ న్యాయం కాదని ఈ సంఘటనకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ యూనియన్ నాయకులు డిఎంను కలిసి ప్రాధేయపడి అడిగినప్పటికీ వ్యక్తిగత దూషణలతో అధికార అహంకారంతో దళిత ఉద్యోగిని సస్పెండ్ చేయడానికి పూనుకున్నారన్నారు. దళిత ఉద్యోగిపై చర్యలు తీసుకొని ఏ తప్పు లేకుండా ఏ కారణం లేకుండా ఆ ఉద్యోగిని సస్పెండ్ చేయడం ఎంతవరకు న్యాయమని దళిత సంఘాలు ప్రశ్నిస్తున్నాయన్నారు. ఎంఆర్ మూర్తి అనే వ్యక్తిని ఎందుకు సస్పెండ్ చేశారో, ఏ కారణం ద్వారా సస్పెండ్ చేశారో వివరాలు తెలుసుకొని విచారణ చేసినటు వంటి రిపోర్టు అసంబద్ధమని, ఆ రిపోర్టు ఆధారంగా ఉన్నతాధికారుల వద్దకు, రాష్ట్ర మంత్రుల వద్దకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. వారం రోజుల్లోగా ఎంఆర్ మూర్తికి ఉద్యోగం ఇవ్వకపోతే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాలతోనూ ఎస్సీ, ఎస్టీ, దళిత సంఘాలతోను ఆర్టీసీ యూనియన్ సంఘాలతోనూ పోరాటం చేస్తామన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు.

సక్రమంగా విధులు నిర్వహించకపోతే చర్యలు

పిటి మండ, టికె జమ్ము కార్యదర్శులపై ప్రత్యేకాధికారి ఆగ్రహం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

గ్రామ సచివాలయ ఉద్యోగులు విధులను సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని గ్రామ సచివాలయాల ప్రత్యేక అధికారి కె.రామచంద్రరావు సచివాలయ ఉద్యోగులను హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో సచివాలయ ఉద్యోగులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నెల రోజుల్లో సచివాలయంలో ఏ ఒక్క సేవ అందించని టికె జమ్ము, పిటి మండల పంచాయితీ కార్యదర్శులపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిటి మండ కార్యదర్శికి మెమో జారీ చేయాలంటూ అధికారులను ఆదేశించారు. సచివాలయం ద్వారా 545 సేవలను ప్రజలకు అందించవచ్చునని, ప్రతి ఒక్కరూ ఈ సేవలను అందుకునేలా సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు. ప్రతి లబ్ధిదారునికి సేవలందాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్న గ్రామ సచివాలయాల వ్యవస్థ బలపడాలని సూచించారు. ఉద్యోగుల్లో ఏ ఒక్కరికి మినహాయింపు ఉండదని సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులంతా ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను వివరిస్తూ ప్రతి ఒక్క సేవ కూడా సచివాలయం ద్వారానే అందేలాఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాలని లేదంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతిరోజు సాయంత్రం మూడు గంటల నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులను అందుకోవాలని ఉద్యోగులకు సూచించారు. సమావేశంలో పార్వతీపురం, పాలకొండ డిఎల్‌డిఒలు వివి గోపాలకృష్ణ, చంద్రమ్మ, ఎంపిడిఒ ఎస్ రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ, తృతీయ సంవత్సరం అభ్యసిస్తున్న విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం డిగ్రీ ఫస్ట్ ఇయర్‌లో చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా ఉన్నతమైన లక్ష్యాలను నిర్మించుకొని, ఆ లక్ష్యాలు సాధనకు అవసరమైన కృషిని చేసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలిపారు. డిఎస్‌పి కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు చక్కని చదువులు అభ్యసిస్తూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జి.జనార్ధన్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు చక్కని కృషి చేసి మంచి మార్కులు సాధించడంతో పాటు జీవితంలో మంచి ఉద్యోగాలు సాధించాలని, తద్వారా కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిఐ మురళీధర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి ప్రభాకరరావు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ బి.రాజు, రూసా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్ సిహెచ్ రాఘవేంద్ర నాయుడు, డాక్టర్ సిహెచ్‌ఎంఎస్ కుమారి, డాక్టర్ ఎస్ జగన్‌మోహన్‌రావు, వి.జనార్ధనరావు, టి.పార్వతీశ్వరరావు, టి.సీతారాం, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు చేసిన సామూహిక డాన్సులు, స్కిట్లు అందర్నీ ఆకట్టుకున్నాయి.

జియోట్యాగింగ్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - భామిని

పిఎం అవాస్ యోజన ద్వారా మంజూరైన ఇళ్లకు నూరుశాతం జియో ట్యాగింగ్, రిజిస్ట్రేషన్ చేయాలని గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి.రఘురాం అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జియో ట్యాగింగ్, రిజిస్ట్రేషన్లను రెండు రోజుల్లో పూర్తి చేయాలని హౌసింగ్ ఎఇ, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను సూచించారు. జిల్లాలో అర్బన్‌లో అవాస్ యోజన ద్వారా 24,743 ఇళ్లు మంజూరయ్యాయని, వీటిలో 21,534 ఇళ్లకు జియో ట్యాగింగ్, రిజిస్ట్రేషన్ పూర్తి చేశామని అన్నారు. మిగిలిన 30,268 ఇళ్లకు రిజిస్ట్రేషన్ పూర్తయ్యాలా చర్యలు తీసుకుంటామన్నారు. అవాస్ యోజన ద్వారా జిల్లాలోని రూరల్‌లో 6785 ఇళ్లు మంజూరయ్యాయని, వీటిలో 5721జియో, రిజిస్ట్రేషన్ పూర్తి చేశామని, మిగిలిన 1564 ఇళ్లకు రెండు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. మండలంలో 811 ఇళ్లు మంజూరయ్యాయని, వీటిలో 156 ఇళ్లకు జియో ట్యాగింగ్, రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉందని, రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించామని తెలిపారు. పాలకొండ నియోజకవర్గంలో జగనన్న ఇళ్ల పట్టాలు మంజూరైనా వాటికి హౌస్ రిజిస్ట్రేషన్ చేస్తున్నామని, జిల్లాలో పూర్తయినా 6882 గృహాలకు విద్యుత్, వాటర్ సప్లై ఏర్పాటు చేస్తున్నామని హౌసింగ్ పిడి విలేకరులకు తెలిపారు. స్థల సంబంధిత సమస్యలుంటే స్థానిక తహశీల్దార్‌కు లేఖలు పెట్టాలని, ఇళ్ల రిజిస్ట్రేషన్‌లో జెన్యూన్‌గా వ్యవహరించిన, అర్హత ఉన్న ఏ ఒక్క లబ్దిదారుడు నష్ట పోకూడదని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఇఇ టి.రమేష్, ఎఇ అప్పలనాయుడు ఉన్నారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ కృష్ణమహేష్‌రెడ్డి

ఇళ్ల నిర్మాణాలు పరిశీలన

సీతానగరం : జగనన్న లేఔట్ ఇళ్లు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఎంపిడిఒ బి.కృష్ణ మహేశ్ రెడ్డి అన్నారు. మండలంలోని నిడగల్లు గ్రామ జగనన్న లేఔట్‌లో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం జగనన్న లేఔట్లను లబ్ధిదారులు ఎంపిక చేసిందని, వాటి నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు కావాల్సిన సహాయ సహకారాలను ప్రభుత్వం ద్వారా అందించడం జరుగుతుందన్నారు అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించి సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడే పరిష్కరించే దిశగా సిబ్బంది పనిచేయాలన్నారు.

గుర్తింపు సంఘాలను సమావేశాలకు ఆహ్వానించాలి

పార్వతీపురం టౌన్ : ప్రభుత్వం విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై నిర్వహించే సమావేశాలకు రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలను కూడా ఆహ్వానించాలని ఎపి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం కోరారు. ఈమేరకు శుక్రవారం పార్వతీపురం పర్యటనకు విచ్చేసిన విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు వినతి పత్రం అందజేసినట్లు సామల తెలిపారు.

28న వాహనాల వేలం

ప్రజాశక్తి - సీతంపేట

ఎక్సైజ్ కేసులో పట్టుబడిన ఒక ఆటో, రెండు ద్విచక్ర వాహనాలను ఈనెల 28న బహిరంగ వేలం వేస్తున్నట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్, సీతంపేట ఎస్సై ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆశక్తి ఉన్నవారు హాజరుకావాలని కోరారు

వీరఘట్టం : స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈనెల 28న నాటు సారాతో పట్టుబడిన వాహనాలను బహిరంగ వేలంపాట వేయనున్నట్టు ఎస్సై ఎం.హరికృష్ణ శుక్రవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోకు సంబంధించి వేలంపాట వేయనున్నామని, ఆశక్తి గలవారు పాటలో పాల్గొనాల్సిందిగా కోరారు.

జీడి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఏజెన్సీ ప్రాంతాల్లో జీడితోట వేసిన గిరిజన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. అలాగే ఐటిడిఎ పరిధిలోని గిరిజన గ్రామాల్లో జీడితోటలు పండించిన రైతుల వద్దకెళ్లి అధిక దిగుబడి కోసం సూచనలు, సలహాలిచ్చి ఆదుకోవాలని కోరారు.